
సాక్షి అనంతపురం

ఆదివారం । 28 । ఏప్రిల్ । 2024



చీనీ టన్ను రూ.32 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.32 వేలు పలికాయి.



రైతన్నకు విత్తన రాయితీ

రైతుకు ఏ కష్టం రాకుండా ప్రభుత్వం అన్ని చర్యలూ చేపట్టింది. రాయితీపై విత్తన పంపిణీకి చర్యలు తీసుకుంది. 8లో

గరిష్టం/కనిష్టం
43.2°/23.8°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత అధికంగా ఉంది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వడగాల్పులు వీచాయి.

న్యూస్‌రీల్

ఓటర్లకు ఇబ్బందులు తలెత్తనీయొద్దు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

శింగనమల/గార్లదిన్నె/బుక్కరాయసముద్రం: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. శనివారం గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, శింగనమల మండలాల్లో ఆయన పర్యటించారు. పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఎంత మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు, ఎంత మంది నామినేషన్లు తిరస్కరించారు తదితర వివరాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెన్నెల శ్రీనును అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రాల వద్ద తాగునీరు, లైట్లు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. గ్రామస్తులతో మాట్లాడుతూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెన్నెల శ్రీను, తహసీల్దార్ శోభన్‌బాబు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా పాలిసెట్



ఓటీపీఆర్ఐలో పాలిసెట్ రాయడానికి వెళ్తున్న విద్యార్థులు

అనంతపురం: డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు ఏపీ పాలిసెట్–2024 శనివారం సజావుగా నిర్వహించినట్లు జిల్లా కోఆర్డినేటర్ సి. జయచంద్రా రెడ్డి తెలిపారు. జిల్లాలో మొత్తం 8,898 మందికి అభ్యర్థులకు గాను 7,817 మంది (87.85శాతం) హాజరైనట్లు పేర్కొన్నారు. బాలికలు 3,075 మందికి 3,197 మంది (86.28 శాతం) హాజరయ్యారు. బాలురు మొత్తం 5,193 మందికి గాను 4,620 మంది పరీక్ష రాసినట్లు వెల్లడించారు.

అంధుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

అనంతపురం రూరల్: పరిగి మండలం కొడిగెనహళ్లి ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వయోవృద్ధులు, వికలాంగుల సంక్షేమశాఖ ఉప సంచాలకులు అబ్దుల్ రసూల్ శనివారం తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు 40 శాతం వికలాంగత్వం ధ్రువీకరణ పత్రంతో పాటు కుల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్ ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 800889815, 08556–297796 నంబర్లను సంప్రదించాలన్నారు.

వైభవంగా జ్యోతి మహోత్సవం



మల్లెపూలతో అలంకరించిన జ్యోతి ఉత్సవ వాహనంలో చౌడేశ్వరీ మాత

అమడగూరు : చల్లని తల్లి చౌడేశ్వరమ్మ.. మమ్మల్ని చల్లగ చూడమ్మా అంటూ భక్తజనం వేడుకున్నారు. మండల కేంద్రం అమడగూరులో చౌడేశ్వరీదేవి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో ప్రత్యేకత కలిగిన జ్యోతి మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎప్పటిలాగానే కొత్తపల్లికి చెందిన ఆలయ ధర్మకర్త పొట్టా పురుషోత్తమరెడ్డి కుటుంబ సభ్యులు ఈ జ్యోతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలనుంచి అనేక మంది భక్తులు పోటెత్తారు. అమ్మవారి ప్రతిమను పూలపల్లకీలో కొలువుదీర్చి ఆలయం నుంచి రాత్రి 9.30 గంటలకు బయల్దేరి గ్రామ నడిబొడ్డున ఉన్న ఉట్టి దగ్గరకు తీసుకొచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం కొబ్బరికాయలు సమర్పించారు.

నేడు తాడిపత్రికి సీఎం జగన్



సంక్షేమ పథకాలతో పేదల తలరాత మార్చారు. 'నవరత్నాల'తో అందరి జీవితాల్లో వెలుగులు నింపారు. కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమాభివృద్ధిని పరుగులు పెట్టించి దేశ చరిత్రలోనే సువర్ణ అధ్యాయాన్ని లిఖించారు. తన అమ్మగారి పుట్టినిల్లు అయిన అనంతపురం జిల్లాపై మమకారంతో మరింత సంక్షేమాన్ని స్థానికులకు అందించారు. నీరాజనాలు అందుకున్నారు. ఈ క్రమంలోనే ఎన్నికల ప్రచారంలో భాగంగా మరోసారి జిల్లా పర్యటనకు వస్తున్న 'అనంత' మనవడిని అక్కున చేర్చుకునేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు.





హెలిప్యాడ్ పనులను పరిశీలిస్తున్న సీఎం ప్రోగ్రాం కో- ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యే పెద్దారెడ్డి తదితరులు, సీఎం కాన్వాయ్ ట్రయల్ రన్ దృశ్యం

- ఎన్నికల సభలో పాల్గొననున్న ముఖ్యమంత్రి
- ఘన స్వాగతం పలికేందుకు జిల్లా ప్రజలు సిద్ధం
- కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన పోలీసులు

తాడిపత్రి అర్బన్/రూరల్: రాప్తాడు నియోజకవర్గంలో ఫిబ్రవరి 18న చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో 'సిద్ధం' సభ జరిగింది. తమ అభిమాన నేతను చూసేందుకు, ఆయన ప్రసంగాన్ని వినేందుకు లక్షలాదిమంది తరలి వచ్చారు. సరిగ్గా ఆ సభ జరిగిన 40 రోజుల్లోనే ఎన్నికల ప్రచారంలో భాగంగా మళ్లీ బస్సు యాత్రగా జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌కు జనం జేజేలు పలికారు. ఈ క్రమంలోనే మరోసారి జిల్లాకు వస్తున్న ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సిద్ధమయ్యారు.

ఎన్నికలపై దిశానిర్దేశం..

ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాకు వస్తున్నారు. తాడిపత్రి పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో ఆదివారం ఉదయం నిర్వహించే బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. గత ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, ప్రజలకు జరిగిన మంచిని వివరించనున్నారు. ఎన్నికలపై దిశానిర్దేశం చేయనున్నారు.

ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు

సీఎం బహిరంగ సభ ఏర్పాట్లను శనివారం ఎమ్మెల్సీ, సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యే పెద్దారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పరిశీలించారు. వైఎస్ఆర్ సర్కిల్, టీటీడీ కల్యాణ మండపం సమీపంలో జరుగుతున్న హెలిప్యాడ్ పనులను పరిశీలించి అధికారులకు తగిన సూచనలిచ్చారు. ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికేందుకు ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

2 వేల మంది పోలీసులతో బందోబస్తు

సీఎం వైఎస్ జగన్ పర్యటనకు 2 వేల మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల విజయవాడలో సీఎం వైఎస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నం ఘటనను దృష్టిలో ఉంచుకుని పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. శనివారం మధ్యాహ్నానికే పోలీసు బలగాలు తాడిపత్రికి చేరుకున్నాయి. పట్టణాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. జిల్లా ఎస్పీతో పాటు ఇద్దరు అదనపు ఎస్పీలు, 9 మంది డీఎస్పీలు, 26 మంది సీఐలు, 43 మంది ఎస్ఐలతో పాటు 2000 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు విధులకు కేటాయించారు.

బందోబస్తు విభజన

బందోబస్తును 6 సెక్టార్లుగా విభజించారు. ఒక్కో సెక్టారుకు ఇన్‌చార్జ్‌గా డీఎస్పీ ఉంటారు. ఆయన ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, నలుగురు ఎస్ఐలను ఏర్పాటు చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ దిగే హెలిప్యాడ్ వద్ద ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలు, 130 మంది పోలీసు సిబ్బంది ఉండేలా ఏర్పాట్లు చేశారు. అనుమతి ఉన్న వీఐపీలను మాత్రమే లోపలికి అనుమతించనున్నారు.

ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఆధ్వర్యంలో భద్రత..

ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ పొందిన పోలీసులు సీఎం వైఎస్ జగన్ ప్రయాణించే బస్సు చుట్టూ వలయంలా ఏర్పడి రక్షణ కల్పించనున్నారు. ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ డీఎస్పీ ఆశీర్వాదం శనివారం తాడిపత్రికి చేరుకుని హెలిప్యాడ్‌తో పాటు సీఎం వైఎస్ జగన్ పాల్గొనే బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు అందజేశారు.

కాన్వాయ్ ట్రయల్ రన్ విజయవంతం

పుట్లూరు రోడ్డులోని హెలిప్యాడ్ నుంచి బహిరంగ సభ స్థలం వరకూ సీఎం కాన్వాయ్ ట్రయల్ రన్‌ను శనివారం మధ్యాహ్నం ఎస్పీ అమిత్ బర్దర్ పర్యవేక్షణలో నిర్వహించారు. పుట్లూరు రోడ్డు మీదుగా మహాత్మాగాంధీ సర్కిల్‌కు చేరుకుని అక్కడి నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకూ, తిరిగి అక్కడి నుంచి హెలిప్యాడ్ వరకూ ట్రయల్ రన్ విజయవంతంగా సాగింది.

అప్రమత్తంగా ఉండాలి: డీఐజీ అమ్మిరెడ్డి

సీఎం వైఎస్ జగన్ సభాస్థలిని డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ అమిత్ బర్దర్‌తో కలిసి పరిశీలించారు. డీఎస్పీ గంగయ్య, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సీఎం బందోబస్తు ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.

సీఎం జగన్ పర్యటన సాగనుందిలా..

- ఉదయం 8.30 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి రోడ్డు మార్గం గుండా 8.50 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- ఉదయం 9 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో బయలుదేరి 9.45 గంటలకు కర్నూలులోని ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకుంటారు.
- 10 గంటలకు ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.30 గంటలకు తాడిపత్రిలోని హెలిప్యాడ్ స్థలానికి చేరుకుంటారు.
- 10.40 గంటలకు హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గం గుండా బయలుదేరి 10.50కు బహిరంగ సభాస్థలికి చేరుకుంటారు.
- 11 నుంచి 11.45 గంటల వరకు సీఎం వైఎస్ జగన్ బహిరంగ సభలో ప్రసంగిస్తారు.
- బహిరంగ సభ అనంతరం 11.50కు బయలుదేరి రోడ్డు మార్గం గుండా మధ్యాహ్నం 12 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 12.10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 1.10 గంటలకు తిరుపతి జిల్లాలోని వెంకటగిరికి ముఖ్యమంత్రి చేరుకోనున్నారు.

మరింత సంక్షేమాభివృద్ధి!

సీఎం వైఎస్ జగన్ శనివారం ప్రకటించిన మేనిఫెస్టో పేదల సంక్షేమం, అభివృద్ధిని మరింత కాంక్షించేలా ఉందని పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు అభిప్రాయపడ్డారు. వారి మాటల్లోనే..



పేదల మేనిఫెస్టో



వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో ఒక పవిత్ర గ్రంథం. ఓ బైబిల్, భగవద్గీత, ఖురాన్‌లా చూసిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి ధైర్యంగా ఓటు అడిగేందుకు వెళ్లేలా చేసిన దమ్మున్న సీఎం వైఎస్ జగన్. గతంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ 'అమ్మ ఒడి' రూ.15 వేల నుంచి రూ.17 వేలకు పెంచడం, అవ్వాతాతలకు పింఛను రెండు విడతల్లో రూ.3,500 వరకు పెంచతామనడం గర్వించదగ్గ విషయం. ఇది పేదల మేనిఫెస్టో.

– తలారి రంగయ్య, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థి

వాస్తవాలకు దగ్గరగా..



వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో వాస్తవాలకు దగ్గరగా ఉంది. 2014 ఎన్నికల ముందు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు అలవిగాని హామీలను ఇచ్చి, ఏ ఒక్కటీ నెరవేర్చలేకపోయాయి. ప్రత్యేక హోదా, రైల్వే జోన్, విభజన హామీలన్నీ నెరవేరుస్తామని చెప్పి ప్రజలను దగా చేశారు. అందుకే నేడు 'బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ' అని అంటుంటే నిన్ను నమ్మం బాబూ అంటున్నారు.

– పైలా నరసింహయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

పేదల జీవితాల్లో వెలుగులు



చెప్పిన హామీలన్నీ నెరవేర్చి సీఎం జగన్ దేవుడిగా నిలిచారు. పెన్షన్, అమ్మఒడి, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, నేతన్న నేస్తం, మత్స్యకార భరోసా, సున్నావడ్డీ, రైతు భరోసా పెంచుతామనడం సంతోషానిచ్చింది. టిప్పర్, లారీ డ్రైవర్లకు వాహనమిత్ర సదుపాయం కల్పించి వారి జీవనోపాధికి తోడ్పాటు అందిస్తామడనం హర్షణీయం.

– మెట్టు గోవింద రెడ్డి, రాయదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థి

ప్రజారంజకం



ఈ మేనిఫెస్టో ప్రజారంజకంగా ఉందనడంలో ఏ సందేహమూ లేదు. చంద్రబాబులా ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించేదిగా లేదు. అధికార దాహంతో ఆచరణ సాధ్యం కాని హామీలను టీడీపీ మేనిఫెస్టోలో చేర్చారు. ప్రజలను మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. ఎలాంటి పథకాలు అమలు చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందో సీఎం జగన్‌కు తెలుసు.

– కేతిరెడ్డి పెద్దారెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే

పార్టీల అభ్యర్థులు 75.. స్వతంత్రులు 82

- నామినేషన్ల పరిశీలన అనంతరం తేలిన లెక్క
- పార్టీల అభ్యర్థుల కన్నా స్వతంత్రులే అధికం

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అనంతపురం పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 199 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. పరిశీలన అనంతరం 157 మంది నామినేషన్లు ఆమోదించారు. 42 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఇందులో 82 మంది స్వతంత్ర అభ్యర్థులు ఉండగా ప్రధాన పార్టీలతో పాటు ఇతర పార్టీ అభ్యర్థులు 75 మంది ఉన్నారు. దీన్ని బట్టి చూస్తే పార్టీల అభ్యర్థుల కన్నా స్వతంత్ర అభ్యర్థులు ఏడుగురు అధికంగా ఉన్నారు.

- అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి 25 మంది నామినేషన్లు వేయగా.. పరిశీలన అనంతరం 21 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదించారు. ఇందులో పార్టీలకు సంబంధించిన అభ్యర్థులు 13 మంది ఉండగా 8 మంది స్వతంత్రులు ఉన్నారు.
- ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గ స్థానాలకు 174 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా.. పరిశీలన అనంతరం 136 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయి. ఇందులో పార్టీల అభ్యర్థులు 62 మంది ఉంటే స్వతంత్ర అభ్యర్థులు 74 మంది ఉన్నారు.

నియోజక వర్గం	మొత్తం అభ్యర్థులు	పార్టీల అభ్యర్థులు	స్వతంత్రులు
రాయదుర్గం	14	5	9
ఉరవకొండ	11	7	4
గుంతకల్లు	17	7	10
తాడిపత్రి	26	11	15
శింగనమల	16	8	8
అనంతపురం	21	10	11
కళ్యాణదుర్గం	16	7	9
రాప్తాడు	15	7	8
మొత్తం	136	62	74

పార్లమెంట్ నియోజకవర్గంలో....

అనంతపురం	21	8	13

కల్లోలం పారదోలి.. ప్రశాంతత నెలకొల్పి

తాడిపత్రి.. ఒకప్పుడు ఈ పేరు చెబితే ఫ్యాక్షన్ హత్యలు, విధ్వంసాలు, పగలు, ప్రతీకారాలు గుర్తొచ్చేవి. తమ ప్రాపకం కోసం జేసీ కుటుంబం రేపిన చిచ్చుతో ఎన్నో కుటుంబాలు బలయ్యాయి. కానీ 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. నేడు తాడిపత్రి ప్రశాంతంగా ఊపిరి పీల్చుకుంటోంది.



- వైఎస్ జగన్ సీఎం అయ్యాక తాడిపత్రిలో స్వేచ్ఛా వాయువులు
- ప్రజలను పీడించిన జేసీ కుటుంబానికి చెక్
- ఫ్యాక్షన్ ముద్ర దూరం.. స్థానికుల్లో ఆనందం
- ప్రజల బాగును ఓర్వలేక జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆగడాలు

తాడిపత్రి: జేసీ సోదరుల ఆగడాలతో మూడు దశాబ్దాల పాటు తాడిపత్రి వాసులు అల్లాడిపోయారు. గ్రానైట్, ట్రాన్స్‌పోర్టు, మట్కా, పేకాట, కాంట్రాక్టులు, సిమెంటు ఫ్యాక్టరీలు...ఇలా తాడిపత్రిలో ప్రతి అంశాన్నీ ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ప్రతి ఒక్కరూ వీరికి కప్పం కట్టాల్సి వచ్చేది! ఎవరైనా ఎదురు చెబితే వారి ఇంటికి కరెంటు కట్, నీటి సరఫరా బంద్. ఒకానొక దశలో మున్సిపాలిటీ చెత్త తెచ్చి వారి ఇళ్ల ముందు పోయించిన సంఘటనలూ ఉన్నాయి. అద్దెకు నివాసం ఉన్న వారైతే ఇల్లు ఖాళీ చేయాలని ఇంటి యజమాని నుంచి ఒత్తిడి వచ్చేది. ఇలాంటి అరాచకాలతో తాడిపత్రి ప్రజలు నలిగిపోయారు. 2019 ఎన్నికల్లో జేసీ బ్రదర్స్‌కు బుద్ధి చెప్పి ఇంట్లో కూర్చోబెట్టారు.

దివాకర్ రెడ్డితోనే కక్షలకు ఆజ్యం

1982లో జేసీ దివాకర్‌రెడ్డి సమితి ప్రెసిడెంట్‌గా రాజకీయ అరంగ్రేటం చేశారు. అప్పటి నుంచి నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలు మొదలయ్యాయి. పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, తాడిపత్రి, యాడికి మండలాల్లోని పలు గ్రామాల్లో తమ స్వార్థ రాజకీయాల కోసం గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించి ఫ్యాక్షన్‌కు అంకురార్పణ చేశారు. తాడిపత్రి మండలం హుసేనాపురంలో ఇళ్ల దహనాలు, పెద్దపప్పూరు మండలం తురకపల్లి, తాడిపత్రి మండలం వెలమకూరు గ్రామాల్లో హత్యోదంతాలు..ఇలా పలు ఘటనలను ప్రేరేపించారు. 1989 సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన జేసీ దివాకర్‌రెడ్డి మంత్రి హోదాలో పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చి ప్రత్యర్థులపై తప్పుడు కేసులు బనాయింపజేశారనే ప్రచారమూ ఉంది. ఆ సమయంలో చోటు చేసుకున్న పలు హత్యల వెనుక పరోక్షంగా వీరి హస్తం ఉన్నట్లు ఇప్పటికీ చర్చ సాగుతోంది.

- 1993లో యల్లనూరు మండలం వెన్నపూసపల్లిలోని ఓ వర్గానికి వత్తాసు పలకడంతో మొదలైన ఫ్యాక్షన్ మహమ్మారి క్రమంగా ఇతర గ్రామాలకూ విస్తరించింది. వెన్నపూసపల్లికి చెందిన పుల్లారెడ్డి హత్య ఫ్యాక్షన్‌కు నాంది పలికింది. దీంతో జిల్లాలోనే అత్యంత సమస్యాత్మక మండలంగా యల్లనూరు పోలీసు రికార్డుల్లోకెక్కింది.
- 1995–1998 మధ్య కాలంలో తాడిపత్రి మండలం వెలమకూరులో ఏడు హత్యలు జరిగాయి.
- 1996లో తాడిపత్రి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వెలమకూరు గ్రామానికి చెందిన రాజేంద్రనాథ్ రెడ్డి జేసీ వర్గీయుల చేతిలో దారుణహత్యకు గురయ్యాడు.
- పెద్దపప్పూరు మండలం తురకపల్లిలో 1985లో చిన్న అంకన్న హత్యతో మండలంలో ఫ్యాక్షన్ మొదలైంది. ఈ హత్య తర్వాత గ్రామంలో నాలుగు హత్యలు చోటు చేసుకున్నాయి.
- దేవునుప్పలపాడులో 2006లో జరిగిన పంచాయతీ ఎన్నికల పోలింగ్ రోజున రెడ్డిపల్లికి చెందిన రాంభూపాల్‌రెడ్డి పోలింగ్ కేంద్రం వద్ద జేసీ వర్గీయుల చేతిలో దారుణ హత్యకు గురయ్యాడు.
- 2015 మార్చి 31న పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు సింగిల్‌విండో అధ్యక్షుడు అప్పేచెర్ల భాస్కర్‌రెడ్డి పట్టపగలే జేసీ వర్గీయుల చేతిలో హత్యకు గురయ్యాడు.
- గతంలో ఏ ఎన్నికలు జరిగినా నియోజకవర్గంలోని ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో అలజడులు, ఘర్షణ వాతావరణం తలెత్తేవి. 1985 సాధారణ ఎన్నికల్లో పెద్దపప్పూరు మండలం పసులూరు పోలింగ్ కేంద్రంలోకి జేసీ వర్గీయులు చొరబడి రిగ్గింగ్ చేశారు. దీనిపై అప్పట్లో విధుల్లో ఉన్న మిలటరీ అధికారి ఫిర్యాదు మేరకు ఎన్నికల ఇన్‌చార్జ్ ఐపీఎస్ అధికారి దోతాంగే.. జేసీ దివాకర్‌రెడ్డిని అరెస్టు చేయించారు. కొన్నాళ్లకే బయటకు వచ్చిన దివాకర్ రెడ్డి పాత పంథానే కొనసాగించారు.

నేడు శాంతి కుసుమాలు

కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా బాధ్యతలు తీసుకున్న తర్వాత జేసీ సోదరుల అరాచకాలపై పోరుబాట పట్టారు. దీంతో తమ ఆటలు సాగవని భావించిన వారు పెద్దారెడ్డిని ఇబ్బంది పెట్టారు. పలు కేసులు మోపి జైలుకు పంపారు. అయినా ఆయన వెనక్కి తగ్గకుండా ప్రజల పక్షాన నిలబడ్డారు. ఈ క్రమంలోనే 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో నియోజకవర్గంలో ఫ్యాక్షన్‌ను రూపుమాపడంపై దృష్టి సారించారు. ప్రభుత్వం, ఎమ్మెల్యే పెద్దారెడ్డి చొరవతో ప్రస్తుతం గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొంది. అభివృద్ధి పరుగులు పెట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇక్కడి పరిస్థితులను ఎమ్మెల్యే ద్వారా తెలుసుకుని అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు విడుదల చేశారు.

ఓర్వలేకపోతున్న జేసీ ప్రభాకర్

తాడిపత్రి నియోజకవర్గంలో ప్రశాంతత నెలకొని, అభివృద్ధి పథంలో పయనిస్తుండడంతో జేసీ ప్రభాకర్‌రెడ్డి ఓర్వలేక కుట్రలకు తెరలేపాడు. అభివృద్ధి పనులకు అడుగడుగునా అడ్డుపడ్డారు. కోర్టుల్లో స్టేలు తెచ్చి మోకాలడ్డారు. తాజాగా తన కుమారుడు ఎన్నికల్లో పోటీ చేస్తుండడంతో మళ్లీ కుతంత్రాలకు తెరలేపాడు. 'తాడిపత్రిని అభివృద్ధి చేసుకుందాం' అంటూ కొత్త డ్రామాలకు తెరలేపాడు. అయితే, గతంలో ప్రభాకర్ రెడ్డి నైజాన్ని, అరాచకాలను చూసిన నియోజకవర్గ ప్రజలు జేసీ కుటుంబాన్ని ఏమాత్రమూ విశ్వసించడంలేదు.

రైతన్నకు ‘విత్తన’ రాయితీ

- 40 నుంచి 50 శాతం రాయితీతో వేరుశనగ, పప్పుశనగ, కంది విత్తనాలు
- ఖరీఫ్, రబీకి ముందే పంపిణీ చేయడం తో సకాలంలో పంటల సాగు
- ఊరు దాటి వెళ్లకుండా ఆర్బీకే వేదికగా అందిస్తుండటంతో రైతు హ్యాపీ
- టీడీపీ హయాంలో రాయితీ తగ్గింపు, అస్తవ్యస్త పంపిణీతో రైతు ఇక్కట్లు
- వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.375 కోట్ల రాయితీ


విత్తన వేరుశనగ లారీ (ఇన్‌సెట్) విత్తన వేరుశనగ


విత్తన పప్పుశనగ


విత్తన కందులు

అనంతపురం అగ్రికల్చర్: రైతుకు ఏ కష్టం రాకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని చర్యలూ చేపట్టింది. 2019లో అధికారం చేపట్టగానే రైతు సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారు. దేశంలో మరెక్కడా లేని విధంగా ఆర్బీకే వ్యవస్థకు శ్రీకారం చుట్టి అన్నదాత ముంగిటకే సంక్షేమ ఫలాలు అందిస్తున్నారు. ఈ క్రమంలో ఖరీఫ్, రబీలో విత్తనం కోసం అగచాట్లు పడుతూ గ్రామం దాటి వెళ్లకుండా ఊరిలోనే ఆర్బీకే వేదికగా సకాలంలో రాయితీ విత్తనాల పంపిణీ చేపట్టారు. 40 నుంచి 50 శాతం వరకు రాయితీ వర్తింపజేసి వేరుశనగ, పప్పుశనగ, కందులు, చిరుధాన్యాలు, పచ్చిరొట్ట విత్తనాలు తదితర అన్నింటికీ గత ఐదేళ్లలో ఉమ్మడి జిల్లా పరిధిలో 10.19 లక్షల మంది రైతులకు రూ.375 కోట్ల మేర సబ్సిడీని ప్రభుత్వం అందజేసింది. 9.03 లక్షల క్వింటాళ్ల వివిధ రకాల విత్తనాలు అందజేసింది. ఇందులో అనంతపురం జిల్లాలో 8.07 లక్షల మంది రైతులకు 6.70 లక్షల క్వింటాళ్లకు రూ.288.62 కోట్ల రాయితీని వర్తింపజేశారు. శ్రీసత్యసాయి జిల్లా ఏర్పడిన ఈ రెండేళ్లలో 2.12 లక్షల మంది రైతులకు 2.33 లక్షల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.96 కోట్ల సబ్సిడీ భరించింది. సకాలంలో నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయడంతో లక్షల ఎకరాల్లో ఖరీఫ్, రబీ సాఫీగా సాగవుతోంది.

అనంతపురం జిల్లాలో విత్తన రాయితీలు ఇలా..			
సంవత్సరం	విత్తన పంపిణీ	రైతుల సంఖ్య	ప్రభుత్వం అందజేసిన రాయితీ
2019-20	1,64,503 క్వింటాళ్లు	1,46,884 మంది	రూ.48.83 కోట్లు
2020-21	1,66,260 క్వింటాళ్లు	1,98,476 మంది	రూ.51.31 కోట్లు
2021-22	1,31,579 క్వింటాళ్లు	1,58,003 మంది	రూ.49.10 కోట్లు
2022-23	98,203 క్వింటాళ్లు	1,54,480 మంది	రూ.31.40 కోట్లు
2023-24	1,09,943 క్వింటాళ్లు	1,49,499 మంది	రూ.47.98 కోట్లు
మొత్తం	6,70,488 క్వింటాళ్లు	8,07,342 మంది	రూ.288.62 కోట్లు

టీడీపీ హయాంలో ఇక్కట్లు..

చంద్రబాబు హయాంలో విత్తనం కావాలంటే పెద్ద పోరాటం చేయాల్సిన పరిస్థితి. మారుమూల గ్రామాల నుంచి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎర్రటి ఎండలో బారులు తీరితే కాని మూడు బస్తాల విత్తనాలు కూడా దక్కలేదు. ఒక్కోసారి మరుసటి రోజు ఇంటిల్లిపాదీ పంపిణీ కేంద్రానికి చేరుకుని పడిగాపులు కాశారు. ఇంకొన్నిసార్లు పంపిణీ కేంద్రాల వద్దకు రాత్రిళ్లు చేరుకుని అక్కడ చెప్పులు, టవళ్లు క్యూలైన్లలో ఉంచి ఎదురుచూశారు. ఎంతో శ్రమతో డబ్బు ఖర్చుపెట్టుకుని తీసుకున్న విత్తనాల్లో అత్యధికంగా పుచ్చులు, నాసులు, కల్తీ సరుకుతో రైతులకు నష్టాలు తప్పలేదు. వేరుశనగ, పప్పుశనగ విత్తనాలతో పాటు ప్రత్యామ్నాయ విత్తన పంపిణీ అనగానే అటు అధికారులకు ఇటు రైతులకు గుండెల్లో గుబులు పుట్టేదే. ఇంతటి దయనీయ పరిస్థితి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కనిపించలేదు. ఉన్న ఊళ్లోనే ఆర్బీకేల్లో సాఫీగా అవసరమైన విత్తనాన్ని అందుకుంటున్నారు.

శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో విత్తన పంపిణీ

- 2.12 లక్షల మంది రైతులకు అన్ని రకాల విత్తనాలు కలిపి 2.33 లక్షల క్వింటాళ్ల మేర పంపిణీ చేశారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.96 కోట్ల సబ్సిడీ భరించింది.
- మొత్తమ్మీద ఉమ్మడి జిల్లా పరిధిలో గత ఐదేళ్లలో 10.19 లక్షల మంది రైతులకు రూ.375 కోట్ల సబ్సిడీతో 9.03 లక్షల క్వింటాళ్ల మేర వివిధ రకాల విత్తనాలు అందించారు.

ఎన్నికల వ్యయంపై ‘షాడో’ నిఘా

కళ్యాణదుర్గం: అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని పరిశీలన చేస్తున్న అధికారులు ఆయా ఖర్చులను ‘షాడో’ రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు. ఈ లెక్కల ఆధారంగానే అభ్యర్థుల వ్యయాన్ని లెక్కించనున్నట్లు వ్యయ నియంత్రణ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో తాము చేస్తున్న ఖర్చును ఎవరు చూస్తారులే అని నిర్లక్ష్యంగా వ్యవహరించే అభ్యర్థులు చివరకు చిక్కుల్లో పడక తప్పదు. షాడో రిజిస్టర్ నిర్వహణ బాధ్యతను నియోజకవర్గ స్థాయి ఎన్నికల అధికారి పర్యవేక్షణలో అకౌంటింగ్ బృందాలు పరిశీలన చేయాల్సి ఉంది. ఒకప్పుడు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు 15 రోజులకోసారి సమర్పించే రికార్డులను పరిశీలకులు తనిఖీ చేసేవారు. ఇందుకు భిన్నంగా ప్రస్తుతం షాడో రిజిస్టర్ లెక్కలతో అభ్యర్థి వ్యయాన్ని సరి చూసుకోనున్నారు. దీంతో అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ప్రతి పైసాకు లెక్కలు చూపాల్సిన అవసరం ఏర్పడింది. షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచే వ్యయం అంతా ఆయా రాజకీయ పార్టీల పరిధిలోకి చేరింది. అభ్యర్థుల ప్రకటన అనంతరం ప్రచారంతో పాటు ఇతర ఖర్చుల మొత్తాన్ని ఆయా అభ్యర్థుల వ్యయం కింద చూపనున్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అభ్యర్థులు రూ.40 లక్షలకు మించి ఖర్చు చేయకూడదు.

అబార్షన్ కేసులో ఇద్దరిపై క్రిమినల్ కేసు నమోదు

- ప్రైవేట్ క్లినిక్ సీజ్ చేసిన అధికారులు


అనధికారిక క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

గుంతకల్లు: ఎలాంటి అనుమతులు లేకుండా గుంతకల్లులోని కథలగేరిలో నిర్వహిస్తున్న క్లినిక్‌ను సీజ్ చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి తెలిపారు. అబార్షన్ వికటించి గర్భిణి మాధవి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం డీఎంహెచ్ఓ బృందం కథలగేరిలోని క్లినిక్ పరిశీలనకు వచ్చారు. పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న వారిని విచారణ చేశారు. ఈ సందర్భంగా విస్తుపోయే అంశాలు వెలుగు చూశాయి. గతంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆయాగా పనిచేస్తూ మానేసిన ఖురిసీ బేగం తాను నివాసముంటున్న ఇంటి ఎదురుగానే ఓ గదిని అద్దెకు తీసుకుని ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న కుమార్తె ఫర్హానాతో కలసి అనధికారికంగా క్లినిక్‌ను ప్రారంభించింది. అందులోనే రెండు బెడ్లను ఏర్పాటు చేసి, కాన్పులు, గుట్టు చప్పుడు కాకుండా అబార్షన్లు చేస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలోనే గత శుక్రవారం మాధవికి చేసిన అబార్షన్ వికటించడంతో ఏమి చేయాలో తెలియక ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించింది. అనంతరం గర్భిణి మృతి చెందిన విషయం తెలియగానే ఇంటికి తాళం వేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. తమ విచారణలో తేలిన అంశాలపై అధికారులు నివేదిక సిద్ధం చేసి క్లినిక్‌ను సీజ్ చేశారు. అనంతరం ఖురిసీ బేగంతో పాటు ఆమె కుమార్తె ఫర్హానాపై గుంతకల్లు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసి, క్రిమినల్ కేసు నమోదుకు సిఫారసు చేశారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ రవిశంకర్, డాక్టర్లు కళ్యాణ్‌చక్రవర్తి, స్వాతి, అరుణ, రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల ద్రోహి చంద్రబాబు

- వైఎస్సార్‌సీపీ నేత ఫయాజ్ బాషా ధ్వజం
- కూటమి పార్టీల నుంచి మైనార్టీలు స్వచ్ఛందంగా వైదొలగాలని పిలుపు



తాడిపత్రి: పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు మైనార్టీలపై కక్ష సాధింపునకే తన పదవీ కాలం మొత్తాన్ని వినియోగించారని ముస్లిం మైనార్టీ నాయకుడు, తాడిపత్రి మున్సిపల్ కౌన్సిలర్ ఫయాజ్ బాషా ధ్వజమెత్తారు. తన మంత్రి వర్గంలో ఒక్క ముస్లిం మైనార్టీ ఎమ్మెల్యేకూ చోటు కల్పించకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. శనివారం సాయంత్రం తాడిపత్రిలోని తన నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మొదటి నుంచి ముస్లింల వ్యతిరేకిగానే చంద్రబాబు ఉంటున్నారన్నారు. 2014లో అధికారంలో ఉన్న సమయంలో మైనార్టీ శాఖను పల్లె రఘునాథరెడ్డికి అప్పగించారని, తర్వాత ఆ శాఖను తనవద్దే ఉంచుకుని మైనార్టీలను నీచంగా చూసిన చంద్రబాబు తీరును మరవలేమన్నారు. ఇటీవల ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని కేంద్ర మంత్రి అమిత్ షా బాహాటంగా పేర్కొన్న అంశాన్ని ఖండిస్తూ... చంద్రబాబుకు, పవన్‌కళ్యాణ్‌కు నిజంగా దమ్ము, ధైర్యముంటే దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వరప్రసాదమైన ముస్లిం రిజర్వేషన్ చట్టాన్ని రద్దు చేయబోమని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో చెప్పించాలని సవాల్ విసిరారు. అధికార దాహంతో రగిలిపోతూ మతతత్వ పార్టీతో పొత్తు పెట్టుకుని ముస్లింలను అన్ని రకాలుగా అణచి వేసేందుకు సిద్ధమైన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ను నమ్మరాదన్నారు. బీజేపీతో జత కట్టిన టీడీపీ, జనసేనను కూడా ముస్లిం వ్యతిరేక పార్టీలుగా గుర్తించి, ఆయా పార్టీల్లో కొనసాగుతున్న ముస్లింలు స్వచ్ఛందంగా బయటకు రావాలని పిలుపునిచ్చారు. నాలుగు శాతం రిజర్వేషన్లను ముస్లింలకు కల్పించి, విద్య, ఉద్యోగావకాశాల్లో సమాన అవకాశాలు కల్పించిన ఘనత దివంగత నేత రాజశేఖర్ రెడ్డిదేనని కొనియాడారు. మైనార్టీలకు తగిన గుర్తింపునిచ్చిన గొప్ప నాయకుడిగా సీఎం వైఎస్ జగన్ ప్రతి ముస్లిం హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. గెలిచిన వెంటనే డిప్యూటీ సీఎంగా అంజాద్ బాషాను చేశారన్నారు. రాష్ట్రంలోని ఐదు అసెంబ్లీ స్థానాలను ముస్లింలకు కేటాయించారన్నారు. ఇందులో ఒకరు ఓడిపోతే ఎమ్మెల్సీని చేసి మైనార్టీలపై తన ప్రేమను చాటుకున్నారన్నారు. మైనార్టీ వర్గాల అభ్యున్నతికి 12 కార్పొరేషన్లను ఏర్పాటు చేశారన్నారు. మైనార్టీలకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ఫ్యాన్ గుర్తుపై ప్రతి ఒక్క ముస్లిమూ ఓటు వేసి మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌ను చేసుకుందామని పిలుపునిచ్చారు.

అబార్షన్‌లో గర్భిణి మరణిస్తే చర్యలు తప్పవు

- జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: అబార్షన్ చేసిన సమయంలో గర్భిణి మరణిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, సంబంధిత ప్రైవేట్ క్లినిక్‌ను సీజ్ చేస్తామని డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి హెచ్చరించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం అమలులో భాగంగా శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆడపిల్ల ప్రాముఖ్యతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించడానికి వైద్య సిబ్బందితో పాటు స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కమిటీ సభ్యులు పలు తీర్మానాలకు అంగీకారం తెలిపారు. టీనేజీ ప్రెగ్నెన్సీను అరికట్టాలని, రెన్యూవల్ చేసుకోని స్కానింగ్ సెంటర్లను మూసి వేయాలని, ప్రతి స్కాన్ సెంటర్ నిర్వాహకులు ఫారం-ఎఫ్ ను ప్రతి నెలా పంపేలా చేయాలని తీర్మానం చేశారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సుజాత, డాక్టర్ అనుపమ, డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ రవిశంకర్, కమిటీ సభ్యులు డాక్టర్ సిరప్ప, రెడ్స్ సంస్థ భానుజ, హెడ్స్ సంస్థ విజయ్‌కుమార్, గైనకాజలిస్టు డాక్టర్ సౌజన్య, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ భాస్కర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే బ్రాహ్మణుల అభ్యున్నతి

- రాష్ట్ర బ్రాహ్మణ సంఘం నాయకుడు జ్వాలాపురం శ్రీకాంత్



మాట్లాడుతున్న జ్వాలాపురం శ్రీకాంత్

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీలోనే అన్ని విధాలుగా బ్రాహ్మణులకు న్యాయం చేకూరిందని రాష్ట్ర బ్రాహ్మణ సంఘం నాయకుడు జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో అన్ని రంగాల్లోనూ అణచివేతకు గురైన బ్రాహ్మణులకు అధికారం చేపట్టగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరైన ప్రాధాన్యత నిస్తూ వచ్చారన్నారు. 2019 ఎన్నికల్లో నాలుగు అసెంబ్లీ స్థానాలను బ్రాహ్మణులకు కేటాయించారన్నారు. ఇందులో ఇద్దరు ఓడినా.. వారికి చైర్మన్లుగా అవకాశం కల్పించారన్నారు. రాష్ట్రంలో 18 మంది కార్పొరేటర్లు, కౌన్సిలర్లుగా బ్రాహ్మణులకు అవకాశం వచ్చిందంటే సీఎం వైఎస్ జగన్ చలువేనన్నారు. పోలీసు వెల్ఫేర్, హస్త కళల్లో ఐదు గురు డైరెక్టర్ స్థానాలతో పాటు ప్రభుత్వ సలహాదారులుగా మరో ఐదుగురికి అవకాశం కల్పించారన్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని బ్రాహ్మణులకు పిలుపునిచ్చారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కామేశ్వరరావు మాట్లాడుతూ... 2014 నుంచి 2019 వరకూ రికార్డులు పరిశీలిస్తే చంద్రబాబు హయాంలో బ్రాహ్మణులు ఎంత ఘోరంగా అణచివేతకు గురైంది అర్థమవుతుందన్నారు. మంచి చేసిన ప్రభుత్వానికి అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో డైరెక్టర్లు అంజిబాబు, ప్రసాద్, రామబ్రహ్మం, సీనియర్ నాయకులు శేషగిరిరావు, జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వెంకటశర్మ, పవన్, రమేష్, రఘు, రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, శ్రీధర్, రఘురాం, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

బెంగాల్ వాసి ఆత్మహత్య


మృతుడు బిశ్వజిత్‌సస్మల్

గుంతకల్లు: జీవితంపై విరక్తితో వలస కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు-కల్లూరు రైలు మార్గంలోని గూళ్యపాళ్యం రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై ఓ మృతదేహాన్ని శనివారం ఉదయం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహం వద్ద లభ్యమైన ఆధారాలను బట్టి మృతుడిని వెస్ట్ బెంగాల్‌లోని నారాయణఖర్ గ్రామానికి చెందిన బిశ్వజిత్ సస్మల్ (29)గా గుర్తించారు. జీవితంపై విరక్తితో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లుగా నిర్ధారించుకున్నారు. మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించి, మృతదేహాన్ని గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య


మృతురాలు శ్రావణి

యాడికి: వ్యసనాలకు బానిసైన భర్తలో మార్పు రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం నక్కనదొడ్డి గ్రామానికి చెందిన రంగస్వామి కుమార్తె శ్రావణి (36)కి పదేళ్ల క్రితం యాడికి మండలం కోనుప్పలపాడు గ్రామానికి చెందిన శ్రీరాములు కుమారుడు బ్రహ్మయ్యతో వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయ పనులజీవనం సాగిస్తున్న బ్రహ్మయ్య తాగుడుకు బానిసయ్యాడు. మద్యం మానేయాలని పలుమార్లు భార్య వేడుకున్నా ఆయనలో మార్పు రాలేదు. ఇదే అంశంపై శుక్రవారం రాత్రి దంపతుల మధ్య గొడవ జరిగింది. శనివారం మధ్యాహ్నం తిరిగి బ్రహ్మయ్య మద్యం మత్తులో ఇంటికి చేరుకోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రావణి జీవితంపై విరక్తితో క్రిమి సంహారక మందు తాగింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఓ ప్రైవేట్ వాహనంలో యాడికిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తండ్రి రంగస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్ఐఓగా వెంకటరమణనాయక్


వెంకటరమణనాయక్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాళ్లు, కార్యాలయ ఉద్యోగులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారిగా (ఆర్ఐఓ)గా వెంకటరమణ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు బోర్డు కార్యదర్శి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆర్ఐఓగా పని చేస్తున్న సురేష్‌బాబును అనారోగ్య కారణాల రీత్యా ఈ బాధ్యతల నుంచి తప్పించారు. దీంతో జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారిగా పని చేస్తున్న వెంకటరమణనాయక్‌కు ఆర్ఐఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా పలువురు ప్రిన్సిపాళ్లు, సిబ్బంది బొకేలు అందజేసి, అభినందించారు.

ఐచర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

గార్లదిన్నె: మండలంలోని తలగాచిపల్లి క్రాస్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఐచర్ వాహనాన్ని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా నందికొట్కూరు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు శుక్రవారం రాత్రి బెంగళూరు నుంచి 25 మంది ప్రయాణికులతో బయలుదేరింది. శనివారం తెల్లవారుజామున తలగాచిపల్లి క్రాస్ సమీపంలోకి చేరుకోగానే స్పీడ్ బ్రేకర్ల వద్ద ఐచర్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. అదే సమయంలో ఐచర్ వెనుకనే వస్తున్న ఆర్టీసీ బస్సు వేగాన్ని నియంత్రించే క్రమంలో డ్రైవర్ సుబ్బరాయుడు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. బస్సు నేరుగా వెళ్లి ఐచర్‌ను వెనుక నుంచి ఢీకొంది. ఘటనలో డ్రైవర్‌తో పాటు ప్రయాణికులు గోవిందమ్మ, శ్రీదేవి, వలీబాషా గాయపడ్డారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ సుబ్బరాయుడును 108 అంబులెన్స్ ద్వారా పామిడిలోని సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదంలో చిన్నారి మృతి


ఝాన్సీ (ఫైల్)

నార్పల: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ చిన్నారి మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... నార్పల మండలం నడిమిదొడ్డి గ్రామానికి చెందిన నాగార్జున తన కుమార్తె ఝాన్సీ (8)కు రామగిరి మండలం నసనకోటలో జరిగే గురుకుల ప్రవేశ పరీక్ష కేంద్రం కేటాయించారు. దీంతో శనివారం ఉదయం కుమార్తెను పిలుచుకుని ద్విచక్ర వాహనంపై నసనకోటకు నాగార్జున బయలుదేరారు. నార్పల శివారులోని ఆర్టీటీ కార్యాలయం వద్దకు చేరుకోగానే రోడ్డుకు అడ్డంగా కుక్క పరుగున వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో వాహనం అదుపు తప్పి ఇద్దరూ కిందపడ్డారు. ఝాన్సీ అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన నాగార్జునను స్థానికులు వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై ఎస్ఐ రాజశేఖరరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అర్హులందరికీ సంక్షేమమే లక్ష్యం


అనంతపురం కార్పొరేషన్: 31వ డివిజన్‌లో ఎమ్మెల్యే అనంత ప్రచారం


ఇందిరమ్మ కాలనీలో ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 31వ డివిజన్‌లో కొనసాగిన 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమం అందించేలా చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని 31వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 85 సచివాలయాల పరిధిలో రూ.2,300 కోట్లకుపైగా సంక్షేమం అందించిన విషయాన్ని గుర్తు చేశారు. అభివృద్ధి విషయానికొస్తే.. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.1,045 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అందులో రూ.800 కోట్లతో కేవలం రోడ్లు, కాలువలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు తీసుకెళ్లినట్లు తెలిపారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉంటేనే సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ అనంతపురం, హిందూపురం నియోజకవర్గాల డిప్యూటీ రీజినల్ కో–ఆర్డినేటర్ రాగే పరుశురాం, మేయర్ వసీం, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వర్థ నాయక్, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణ, అనుబంధ సంఘాల అధ్యక్షులు సైపుల్లా బేగ్, కొర్రపాడు హుస్సేన్ పీరా, శ్రీదేవి, కృష్ణవేణి, కార్పొరేటర్లు సాకే చంద్ర, రాజేశ్వరి, సాకే చంద్రలేఖ, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, కన్వీనర్లు చింతా సోమశేఖర్ రెడ్డి, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, చింతకుంట మధు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ జయచంద్ర నాయుడు, నాయకులు అనిల్‌కుమార్‌గౌడ్, వనారస బలరాం, మిద్దె నగేష్, కేశవ రెడ్డి, సూర్యప్రకాష్ రెడ్డి, జావెద్, కేశవరెడ్డి, రియాజ్, దేవి, శోభాబాయి, ఉష, హజరాంబి, సుజాత రెడ్డి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

మోసాలకు కేరాఫ్ చంద్రబాబు

అనంతపురం రూరల్: అభివృద్ధి సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయం. మాటిస్తే ఎన్ని కష్టాలు ఎదురైనా సీఎం జగన్ నెరవేర్చుతారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం ఏ.నారాయణపురం పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. నవరత్నాల పథకాల ద్వారా ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించామన్నారు. ప్రజల ముంగిటకే పాలన తీసుకొచ్చిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అబద్ధపు హామీలు ఇవ్వడం తమ పార్టీ నైజం కాదన్నారు. చంద్రబాబు మాదిరి అలివిగాని హామీలు ఇవ్వమన్నారు. హామీ ఇస్తే ఎంత కష్టమైనా వాటిని నేరవేర్చుతామన్నారు. అబద్ధాలు, మోసాలకు కేరాఫ్ చంద్రబాబు అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలబడిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహితీ, ఎంపీటీసీ నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, రూరల్ మండల కన్వీనర్ హుస్సేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాయల్ మనోజ్ కుమార్, మల్లెల వేణుగోపాల్, కృష్ణవేణి, జగన్‌మోహన్‌రెడ్డి, సత్యన్న పాల్గొన్నారు.


ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

వైఎస్సార్‌సీపీలో చేరిక

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 50వ డివిజన్‌కు చెందిన పలువురు నాయకులు టీడీపీని వీడారు. శనివారం వైఎస్సార్‌సీపీ నాయకురాలు సుజాత రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే అనంత తన నివాసం వద్ద టీడీపీ నాయకులకు పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ముల్లా వలిబాషా, గౌస్‌పీరా, షేక్ రఫి, మహమ్మద్ రఫి, జిలాన్ బాషా, ముక్తియార్, సాయిరత్న, నూర్జహాన్, షకీన, దిల్షాద్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, నాయకులు అనిల్ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పని నేత సీఎం జగన్


కేఎస్ పాళ్యంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


రామగిరి: దుబ్బార్లపల్లిలో ప్రజలకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

- అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా మేనిఫెస్టో రూపకల్పన
- దోచుకుని దాచుకోవడమే పరిటాల కుటుంబం నైజం
- చంద్రబాబు హామీలు నమ్మి మోసపోవద్దు
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రామగిరి: 30 ఏళ్లుగా చుక్కనీరు లేక కళతప్పిన పేరూరు డ్యాంకు కృష్ణా జలాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని పెదయ్యగారి కొట్టాల, మక్కినవారిపల్లి, చిన్నకొండాపురం, పెద్దకొండాపురం, దుబ్బార్లపల్లి, ఆర్.కొత్త పల్లి, కానుగులకుంట, రామగిరి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం జగన్ ఏదైనా హామీ ఇస్తే తప్పక నెరవేర్చుతారన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా మేనిఫెస్టో రూపొందించడం జరిగిందన్నారు. పరిటాల కుటుంబం మంత్రులు, ఎమ్మెల్యేలుగా కొనసాగుతూ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. దోచుకుని, దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో మాత్రమే గ్రామాల్లోకి వచ్చి మేం అధికారంలోకి వస్తే అది చేస్తాం.. ఇది చేస్తాం అంటూ ప్రజలను మభ్యపెడుతారన్నారు. గతంలో డ్వాక్రా, రైతుల రుణాలను మాఫీ చేస్తామని చెప్పి.. అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలను మోసం చేసిన ఘనత వారికే దక్కుతుందన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను నెరవేర్చడం జరిగిందన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందేలా సీఎం జగనన్న చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే రామగిరి, కనగానపల్లి మండలాల్లో సోలార్‌ప్లాంట్‌కు రైతులు భూములిచ్చారని తెలిపారు. త్వరలోనే ఈ ప్రాంతాల్లో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి 7,000 మందికి ఉపాధి కల్పిస్తామన్నారు. అంతేకాక రామగిరి బంగారు గనులు తెరిపించేందుకు సన్నాహాలు పూర్తి అయినట్లు పేర్కొన్నారు. త్వరలోనే గనులను తెరిపించి ప్రజలకు ఉపాధి కల్పిస్తామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో చంద్రబాబు మాయమాటలు చెప్పి ప్రజలను మరోసారి మోసగించేందుకు సిద్ధంగా ఉన్నారని మండిపడ్డారు. వారి మాటలను నమ్మితే గతంలో ఎంత ఇబ్బందులు పడ్డామో గుర్తు చేసుకోవాలన్నారు. త్వరలోనే ఆత్మకూరు, కనగానపల్లి, రామగిరి మండలాల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే గ్రామాల్లోని సమస్యలను పరిష్కరిస్తానని హామీచ్చారు. ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ మీనుగ నాగరాజు, జెడ్పీటీసీలు నాగార్జున, మారుతి, మండల కన్వీనర్లు కర్రా హనుమంతరెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, సర్పంచులు రాజేష్, సిద్ధన్న, చెన్నకేశవ రెడ్డి, నరేంద్ర, ఓబిరెడ్డి, మండల కో–ఆప్షన్ మెంబర్ ముజుబుర్, నాయకులు గంగుల సుధీర్‌రెడ్డి, నరసింహా రెడ్డి, వెంకటరెడ్డి, దాసరి మోహన్, రామాంజనేయులు, జనార్దన్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కేఎస్ పాళ్యంలో జోరుగా ప్రచారం

కనగానపల్లి: పేదలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలంటే తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కేఎస్ పాళ్యం గ్రామంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. తర్వాత ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు.గత టీడీపీ ప్రభుత్వ పాలనను, సీఎం జగన్ పాలనను బేరీజు వేసుకుని ఎన్నికల్లో ఓటు వేయాలన్నారు. ఇక 25 ఏళ్ల పాటు ఈ ప్రాంత పాలకులుగా ఉన్న పరిటాల కుటుంబం పేదలకు ఎటువంటి మేలు చేయలేదన్నారు. రూ.కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత పేరూరు డ్యాంకు కృష్ణా జలాలు తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసినట్లు గుర్తు చేశారు. గ్రామాల్లో ఎటువంటి ఫ్యాక్షన్ ఘర్షణలు లేకుండా ప్రజలంతా ప్రశాంతంగా జీవనం సాగించేలా పాలన చేశామన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి రాప్తాడు ఎమ్మెల్యేగా తనను, హిందూపురం ఎంపీగా బోయ శాంతమ్మను గెలిపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మారుతిప్రసాద్, ఎంపీపీ భర్త నాగముని, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, స్థానిక ఎంపీటీసీలు, సర్పంచులు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన తగరకుంట టీడీపీ నాయకులు


కేఎస్ పాళ్యం, శివపురం కొట్టాల గ్రామాల్లో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరిన కార్యకర్తలు

టీడీపీకి గుడ్ బై..

కనగానపల్లి: రాప్తాడు నియోజకవర్గంలో ప్రతిపక్ష టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు జోరుగా కొనసాగుతున్నాయి. శనివారం మండలంలోని తగరకుంట, కేఎస్ పాళ్యం, శివపురం కొట్టాల గ్రామాల నుంచి పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. తగరకుంట గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అక్బర్ బాషా, కురుబ వన్నూరు స్వామి, వడ్డే ఎర్రిస్వామి, చాకలి చిరంజీవి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి తోపుదుర్తి గ్రామానికి వెళ్లి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువాలు వేసుకున్నారు. అలాగే కేఎస్ పాళ్యం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు పసుల నగేష్, అంకె రామాంజి, హరి, నారాయణప్ప, లక్ష్మీదేవి, ముక్కమ్మ, పేరూరు సరస్వతి, నాగలక్ష్మి, శివపురం కొట్టాలకు చెందిన బోయ లింగమయ్య, సరోజమ్మ, రమణమ్మ, వెంకటేష్, మహేష్, సాయిలీల వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరంతా కేఎస్ పాళ్యంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పార్టీలో చేరారు.

క్లుప్తంగా

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం


నివాళులర్పిస్తున్న రాజశేఖర్ రెడ్డి

రాప్తాడు: మండల కేంద్రానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ గవ్వల పరంధామ నాన్నమ్మ గవ్వల మల్లక్క శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి శనివారం గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మల్లక్క మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధైర్యపడకండి.. అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, ఎన్నికల మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, మండల కన్వీనర్ జూటూరు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎన్నికల విధులు


మాట్లాడుతున్న ఆర్వో వసంతబాబు

రాప్తాడు: ఎన్నికల నిర్వహణలో సిబ్బంది తమ విధులను పారదర్శకంగా నిర్వహించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వసంత బాబు సూచించారు. శనివారం సాయంత్రం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులు, రూట్ అధికారులు, మాస్టర్ ట్రైనర్స్‌కు ఎన్నికల ప్రక్రియ, విధులు, ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పనితీరుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఓగా విధులు నిర్వహించడం గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. రీ పోలింగ్‌కు ఎక్కడా అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ప్రతి చోట పోలింగ్‌కు 90 నిమిషాల ముందే తప్పనిసరిగా మాక్ పోల్ నిర్వహించాలన్నారు. మాక్ పోల్ అనంతరం ఈవీఎంలు డిలీట్ చేయాలని, వీవీ ప్యాట్లు ఖాళీ చేసి సీల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యండి


మామిళ్లపల్లిలో ఓటు అభ్యర్థిస్తున్న తోపుదుర్తి శైలజా రెడ్డి, గంగుల భానుమతి

రాప్తాడు రూరల్: గతంలో ఎప్పుడూ లేనివిధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు పేదల ఆర్థిక స్థితిగతులను మార్చేశాయి. మరిన్ని పథకాలు అందాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటియ్యాలని వైఎస్సార్‌సీపీ నాయకురాలు తోపుదుర్తి శైలజా రెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయతీ పరిధిలోని సుందరయ్య కాలనీ, బీఎస్ఆర్ కాలనీ, జీఎం కాలనీ, దండోరా కాలనీ, ఆదర్శ కాలనీ, జీఎం కాలనీ, సీయేన్ పురంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. హిందూపురం ఎంపీగా బోయ శాంత, రాప్తాడు ఎమ్మెల్యేగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మంచి చేసిన వారిని ఆదరిస్తే మరిన్ని మంచి పనులు చేస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తేజశ్విని, ఎంపీటీసీ సభ్యురాలు గాయత్రిదేవి, నాయకులు డాక్టర్ శీనా, వార్డు మెంబర్ అన్ను, బాషా, సలీం, ప్రమీలమ్మ, సాయి, సూరి, కృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాష్‌రెడ్డిని మరోసారి గెలిపించండి

కనగానపల్లి: రాప్తాడు నియోజకవర్గాన్ని ఫ్యాక్షన్‌కు దూరంగా అభివృద్ధి వైపు నడిపిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకురాళ్లు తోపుదుర్తి శైలజారెడ్డి, గంగుల భానుమతి ఓటర్లను కోరారు. మండలంలోని మామిళ్లపల్లిలో శనివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ తరపున ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలసి ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. నవరత్న సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగాలంటే తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, వైస్ ఎంపీపీ పద్మావతి, సొసైటీ అధ్యక్షుడు భాస్కర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కమలనాభరెడ్డి, స్థానిక సర్పంచ్ ఓబిరెడ్డి, నాయకులు కె. రామలింగారెడ్డి, తిరుపాలు, విజయ్‌కుమార్‌రెడ్డి, దాసరి రామక్రిష్ణ, సూర్యశేఖర్‌రెడ్డి, నాగప్ప, పలువురు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోతో ప్రజలకు మేలు


మదిగుబ్బలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సతీమణి మనోరమ

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ ప్రకటించిన మేనిఫెస్టోతో ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సతీమణి మనోరమ అన్నారు. శనివారం మండలంలోని మదిగుబ్బ గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీడీపీ జన్మభూమి కమిటీ సభ్యులను అడ్డం పెట్టుకుని ప్రజలను నిలువునా మోసం చేసిందన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి నిరంతరం కృషితో రాప్తాడు నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని తెలిపారు. రాప్తాడు నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి ప్రకాష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్ రెడ్డి, మండల కన్వీనర్ లక్ష్మీనరసింహులు, ఎంపీపీ హేమలత, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, సర్పంచ్ నరసింహులు వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్, నాయకులు చిన్నపరెడ్డి, వీరాంజనేయులు, వాసుదేవరెడ్డి, పోతులయ్య, నరసింహారెడ్డి మాజీ జెడ్పీటీసీ గోవిందు నాయక్, గోపాల్ నాయక్, శంకర్ నాయక్, అతిక్‌రెడ్డి, మాధన్న, పంపనూరు సర్పంచ్ ఎర్రిస్వామి, వెంకటేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు అంజి, శ్రీరాములు, ఆదెప్ప, భాను,నాగరాజు, అక్కులన్న, మంజుల, ఈశ్వర రెడ్డి, శంకర్‌రెడ్డి వన్నూరప్ప పాల్గొన్నారు.

లింగారెడ్డిపల్లిలో వనభోజనాలు


సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్తులు

బత్తలపల్లి: మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామస్తులు శనివారం వనభోజన కార్యక్రమం నిర్వహించారు. శ్రీరామనవమి పండుగ అనంతరం వనభోజనాలకు వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా గ్రామంలోని ప్రతి ఒక్కరూ చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా ఇళ్లకు తాళాలు వేసి అందరూ గ్రామంలోని వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి చెట్ల కిందనే రోజంతా గడిపారు. బావుల వద్ద పూజలు నిర్వహించారు. గ్రామస్తులు అక్కడే వంటలు చేసుకుని విందు ఆరగించారు. సాయంత్రం అందరూ గ్రామంలో ఏర్పాటు చేసిన తోరణం కింద ఇళ్లకు చేరుకున్నారు. మాజీ ఎంపీపీ గుర్రం వనజ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాష్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం


ఉపాధి కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న తోపుదుర్తి నయనతా రెడ్డి

రాప్తాడు: మరోసారి రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున రాప్తాడు ఎమ్మెల్యే స్థానానికి బరిలో దిగిన తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామని వైఎస్సార్‌సీపీ సీనియర్ మహిళా నాయకురాలు తోపుదుర్తి నయనతా రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని యర్రగుంట గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఐదేళ్లుగా ఎమ్మెల్యేగా చేసిన ప్రజా సేవలు మళ్లీ గెలిపిస్తాయన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడం జరిగిందన్నారు. ముఖ్యంగా పేరూరు డ్యాంకు నీళ్లు, అమ్మ డెయిరీ, పరిశ్రమలు, రిజర్వాయర్లు, 30 వేల మందికి ఇళ్లు, ఇళ్ల పట్టాలు, రైతులకు ఉచిత బోర్లు ఇలా చెప్పుకుంటూ పోతే నియోజకవర్గ ప్రజలకు ఎంతో సేవ చేశారని వెల్లడించారు. ఎమ్మెల్యేగా తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ఎంపీగా బోయ శాంతమ్మను భారీ మెజార్టీతో గెలిపించాలని ఉపాధి కూలీలను కోరారు. కార్యక్రమంలో ఎన్నికల మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, మండల కన్వీనర్ జూటూరు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల వితరణ

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డికి చెందిన ఓ నిరుపేద కుటుంబానికి నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ పుట్టినిల్లు ఆశ్రమం అండగా నిలిచింది. రామాంజనేయులు, లక్ష్మీదేవి దంపతులకు ఒక కుమారుడు, కూతురు సంతానం. కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవారు. 20 రోజుల క్రితం రామాంజనేయులు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబ పరిస్థితి దయనీయంగా మారింది. సమాచారం అందుకున్న పుట్టినిల్లు ఆశ్రమ నిర్వాహకురాలు డాక్టర్ నిర్మల మురళి శనివారం లక్ష్మీదేవి కుటుంబాన్ని పరామర్శించారు. రెండు నెలలకు సరిపడా 33 రకాల నిత్యావసర సరుకులు, ఒక బియ్యం ప్యాకెట్, రూ.3 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటలక్ష్మి, నాగరాజు, అలివేలు మంగమ్మ, నారాయణమ్మ, కళావతి, కురుబ లింగన్న, నీలమ్మ, సంగమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

మణికంఠకు గౌరవ డాక్టరేట్


గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న మణికంఠ

అనంతపురం: భారత ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఢిల్లీ గుర్తింపు పొందిన హెచ్‌డీపీసీ ఆఫ్ ఇండియా నిర్వహించిన కార్యక్రమంలో బి.మణికంఠకు గౌరవ డాక్టరేట్ అందించారు. అనంతపురానికి చెందిన బి.మణికంఠ సమాజాభివృద్ధికై సాంకేతిక పరివర్తన, ఎథికల్ హ్యాకింగ్ కేర్ ద్వారా ఎంతో మంది నాణ్యమైన శిక్షణ ఇచ్చారు. ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు అధునాతన శిక్షణ ఇవ్వడమే కాకుండా వాటి ఆవిష్కరణ పద్ధతులపై అవగాహన కల్పించారు. వ్యాపారస్తులు, డాక్టర్లు, పోలీసులకు దోహదపడే అధునాతమైన యాప్స్ రూపకల్పన చేశారు. సాంకేతిక పద్ధతి ద్వారా ప్రజలకు, పోలీసులకు సమన్వయం చేసే యాప్స్‌ను ఆవిష్కరించారు. అలాగే మణికంఠను ప్రపంచ మానవ హక్కుల సంఘం సభ్యుడిగా ఎంపిక చేశారు.

వైఎస్సార్‌సీపీతోనే మైనార్టీల సంక్షేమం

అనంతపురం: వైఎస్సార్‌సీపీతోనే మైనార్టీల సంక్షేమం సాధ్యమని మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్ అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదివారం తాడిపత్రిలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మైనార్టీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అండగా నిలుస్తున్నారన్నారు. డిప్యూటీ సీఎం, మండలి డిప్యూటీ చైర్మన్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా, నామినేటెడ్ పదవుల్లో ముస్లిం మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి అందించిన 4 శాతం రిజర్వేషన్లతో నేడు ఎందరో ముస్లిం మైనార్టీ యువత ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. బీజేపీ నేతలు 4 శాతం రిజర్వేషన్లు రద్దు చేస్తామని బహిరంగంగా ప్రకటిస్తున్న తీరును ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాడిపత్రి పర్యటన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు 13వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 13వ డివిజన్‌లో ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని సున్నపు గేరి, బీరప్ప గుడి ప్రచారం మొదలవుతుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

వైవీఆర్‌ను గెలిపించండి



ప్రచారం చేస్తున్న చైర్‌పర్సన్ భవాని, వీసీలు నైరుతి, మైమూన్, ఎమ్మెల్యే కుమార్తె నిషితారెడ్డి

గుంతకల్లుటౌన్: ఎమ్మెల్యే అభ్యర్థి వై.వెంకటరామిరెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్, ఎమ్మెల్యే చిన్న కుమార్తె నిషితారెడ్డి కోరారు. శనివారం 15వ వార్డులోని మార్కండేయస్వామి ఆలయం నుంచి ఇంటింటా ప్రచారం మొదలు పెట్టారు. జగనన్న విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో–2024లో పొందుపరిచిన హామీల గురించి వారు వివరించారు. ఎంపీగా శంకర్‌నారాయణ, ఎమ్మెల్యేగా వైవీఆర్‌ను గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, మల్లికార్జున శాస్త్రి, జి.బావన్న, జాన్, శ్రీనివాసులు, రాజశేఖర్, జంగ్లీ గోపాల్, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ యుగంధర్‌రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్‌సభ్యుడు రాజశేఖర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం



ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ

గుత్తి: మున్సిపాలిటీలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ అన్నారు. మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బిందె వరలక్ష్మి, మాజీ ఎంపీపీ కోనా మురళీధర్ రెడ్డి, పట్టణ కన్వీనర్ పీరా, కౌన్సిలర్ కేవీ రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు సీవీ రంగారెడ్డి, నాయకులు షఫి, రమేష్‌రెడ్డి, జీపు రమణ, సునీల్, మహ్మద్, హమాలి రామాంజి, అరటిపండ్ల చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే అభ్యర్థి ప్రచారం

వజ్రకరూరు: మండలంలోని కమలపాడు, గూళ్యపాళ్యం గ్రామాల్లో ఆదివారం ఇంటింటికీ మన విశ్వన్న కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. ప్రచారానికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి 50 మంది మైనార్టీలు



వైస్‌చైర్మన్లు నైరుతి, మైమూన్‌ల సమక్షంలో పార్టీలో చేరిన ముస్లిం మైనార్టీ నాయకులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఈద్గా మసీదు ఏరియాకు చెందిన 50 మంది ముస్లిం మైనార్టీలు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. శనివారం ఈద్గా మైదానం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, మైమూన్ పాల్గొని వార్డుకు చెందిన నిసార్, రెహమాన్, ఇక్బాల్, సిరాజ్, మగ్బుల్, షాహీద్, మహమ్మద్ తదితరులకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఎన్నికల్లో ఎంపీగా శంకర్‌నారాయణ, ఎమ్మెల్యేగా వై.వెంకటరామిరెడ్డిలను భారీ మెజార్టీతో గెలిపించేందుకు పనిచేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్ రంగన్న, ఈద్గాహాల్ చైర్మన్ ఎంబీ.మౌలా, వార్డు నాయకులు సంచుల బాషా, అక్రమ్, షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

విశ్వ సతీమణి విస్తృత ప్రచారం



ఇంటింటి ప్రచారంలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సతీమణి భువనేశ్వరి

ఉరవకొండ: స్థానిక రంగావీధిలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి సతీమణి వై.భువనేశ్వరి విస్తృతంగా ప్రచారం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ ఫ్యాన్ గుర్తుకు రెండు సార్లు బటన్ నొక్కి మద్దతు తెలపాలని కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వన్నూర్‌సాబ్, గట్టు ఎర్రిస్వామి, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ, మాజీ ఎంపీపీ చంద్రమ్మ, గట్టురామలక్ష్మి, గురికాల ఓబుళమ్మ, పార్టీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గుండెకూ 'జగన్' భరోసా

- ప్రాణాలను నిలుపుతున్న స్టెమీ ప్రాజెక్టు
- గుండెపోటు మరణాలను తగ్గించడమే లక్ష్యం
- ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా రూ.40 వేల ఇంజెక్షన్
- నెల రోజుల్లోనే 16 మందికి ఇంజెక్షన్



గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి



నాగరాజు అనే వ్యక్తికి గోల్డెన్ అవర్‌లో ఇంజక్షన్ వేసి పరీక్షలు నిర్వహిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి

గుంతకల్లుటౌన్: ఆధునిక జీవనశైలి యువతకు పెనుముప్పుగా మారుతోంది. వయస్సుతో సంబంధం లేకుండా ముంచుకొస్తున్న కార్డియక్ అరెస్టులు ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. అయితే గుండె సంబంధిత వ్యాధుల కారణంగా మరణాల రేటును తగ్గించడానికి సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం విప్లవాత్మకమైన వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గుండెపోటు వచ్చిన వారికి అత్యంత కీలకమైన మొదటి గంటలోనే అత్యవసర ప్రాథమిక చికిత్స అందించడం ద్వారా ప్రాణాలను నిలబెట్టే స్టెమీ అనే కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖ అమలు చేస్తోంది. గోల్డెన్ అవర్ ఇవ్వాల్సిన రూ.40 వేలు విలువ చేసే థ్యాంబ్రోలైసిస్ ఇంజెక్షన్‌ను ఉచితంగా రోగికి అందిస్తూ ప్రాణం పోస్తున్నారు. క్యాథ్‌ల్యాబ్స్ ఉన్న అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించి అవసరమైన టెస్టులు, శస్త్రచికిత్సలు నిర్వహించి రోగిని సురక్షితంగా ఇంటికి చేరుస్తున్నారు. గుంతకల్లు ప్రభుత్వాస్పత్రిలో నెలరోజుల వ్యవధిలోనే 16 మంది గుండె సంబంధిత రోగులకు గోల్డెన్ అవర్‌లో రూ.40 వేల ఇంజక్షన్‌ను అందజేసి వారి ప్రాణాలను నిలబెట్టారు. వీరిలో కొందరికి ఇంజెక్షన్‌తోనే వాల్వ్ బ్లాక్స్ క్లియర్ కాగా, మరికొందరికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద స్టంట్‌లు వేసి ఆయువు పోశారు. జగనన్న ప్రభుత్వం తీసుకొచ్చిన స్టెమీ ప్రజల పాలిట సంజీవనిలా మారింది.

నాడు అధ్వానం..నేడు ఆదర్శం

2019 కంటే ముందు అధ్వాన్నంగా ఉన్న గుంతకల్లు ప్రభుత్వాస్పత్రి సీఎం జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత కార్పొరేట్ ఆస్పత్రికి దీటుగా అన్ని రకాల వైద్యసేవలందిస్తోంది. సీఎం జగన్ సహకారం, స్థానిక ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కృషితో వంద పడకల ఆస్పత్రిని 150 పడకలుగా మార్చడమే కాకుండా రూ.15 కోట్లతో ఆస్పత్రిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో ఆస్పత్రి రూపురేఖలు మారిపోయాయి. బ్లడ్‌బ్యాంక్, డయాలసిస్ సెంటర్, ఆక్సిజన్ ప్లాంట్, వెంటిలేటర్లు తదితర అధునాతన, అత్యవసర వైద్యసేవలను కూడా ప్రజలు పొందుతున్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

స్టెమీ ద్వారా అద్భుత ఫలితాలు



గుండె మరణాలను తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పీహెచ్‌సీ, జిల్లా ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో స్టెమీ ప్రాజెక్టును అమలు చేస్తోంది. దీంతో గోల్డెన్ అవర్‌లో గుండె పోటు లక్షణాలతో ఆస్పత్రికి వచ్చిన వెంటనే వారికి రూ.40 వేల ఇంజెక్షన్ ఉచితంగా వేస్తున్నాం. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించి వారి ప్రాణాలను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నాం. ఆస్పత్రిలో నిత్యం ఈ ఇంజెక్షన్లు అందుబాటులో ఉంటాయి.

– డాక్టర్ జయవర్ధన్ రెడ్డి, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్

జగనన్న చేసిన మంచిని మరువలేను

పట్టణంలోని 60 అడుగుల రోడ్‌లో మటన్ దుకాణం నిర్వహిస్తున్నాను. ఈ నెల 21న దుకాణంలో ఉండగా ఛాతీనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఈసీజీ తీసిన వైద్యులు వెంటనే టెనెక్టా ప్లస్ ఇంజెక్షన్ వేశారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం సవేరాకు తరలించగా అక్కడ యాంజియోగ్రామ్ చేశారు. వాల్వ్ బ్లాక్ ఉండటంతో రూపాయి ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ కింద స్టంట్ వేశారు. రెండు రోజుల క్రితం డిశ్చార్జి అయ్యాను. జగనన్న చేసిన మంచిని ఎప్పటికీ మరిచిపోలేను. ఈ ఎన్నికల్లో ఆయనకు అండగా ఉంటాం.

– ఎల్లోజీరావు, గుంతకల్లు

ఇంజెక్షన్ కాపాడింది



బేల్దారిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. ఈ నెల 22వ తేదీ రాత్రి ఛాతీలో తీవ్రమైన నొప్పి వచ్చింది. స్థానికుల సూచన మేరకు ప్రభుత్వాస్పత్రికి వెళ్లాను. ఈసీజీ తీసిన వైద్యులు వెంటనే రూ.40 వేలు విలువ చేసే ఇంజెక్షన్ వేశారు. అనంతరం అనంతపురంలోని సవేరా ఆస్పత్రిలో యాంజియోగ్రామ్ చేశాక వాల్వ్ బ్లాక్ ఉందని నిర్ధారించిన వైద్యులు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద నయాపైసా ఖర్చులేకుండా స్టంట్ వేశారు. శుక్రవారం డిశ్చార్జి అయ్యాను. జగనన్నకు రుణపడి ఉంటా.

– సంతోష్, బెంచికొట్టాల గుంతకల్లు

మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



పోలింగ్‌బూత్ కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న ప్రణయ్‌రెడ్డి

ఉరవకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ బూత్ కమిటీ కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లకు పార్టీ రాయలసీమ జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జగనన్న కోసం సిద్ధం కార్యక్రమంలో భాగంగా పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు ప్రణయ్‌రెడ్డి మాట్లాడుతూ బూత్ కమిటీ, జేసీఎస్ కన్వీనర్లు జగనన్న కోసం సిద్ధం కావాల్సిన సమయం వచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోసం స్టార్ క్యాంపెయినర్‌గా పనిచేయాల్సి ఉంటుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు సీఎం చేసుకోవడానికి గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ వై.శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ గోపీనాథ్‌యాదవ్, శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక

కూడేరు: మండలంలోని శివరాంపేటకు చెందిన టీడీపీ నేతలు బోయ సుధాకర్, బోయ మల్లికార్జున ఎమ్మెల్యే అభ్యర్థి వై. విశ్వేశ్వర రెడ్డి సమక్షంలో శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణ రెడ్డి, పార్టీ నేతలు రామన్న, రాఘవయ్య, శంకరయ్య, నరేష్, రామ్మోహన్, లక్ష్మన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోతో ప్రజల జీవన ప్రమాణాల మెరుగు



దుద్దేకుంటలో రోడ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి



దుద్దేకుంటలో ప్రచారానికి భారీగా తరలివచ్చిన గ్రామస్తులు

- దుద్దేకుంట, అంకంపల్లి ప్రచార సభలో ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి

బెళుగుప్ప: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోతో ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని, దీన్ని అన్ని వర్గాల ప్రజలు స్వాగతిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శనివారం బెళుగుప్ప మండలంలోని దుద్దేకుంట, అంకంపల్లి గ్రామాల్లో చేపట్టిన ఎన్నికల ప్రచారంలో ఆయా గ్రామాల ప్రజలు విశ్వకు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా పూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. తొలుత స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, రోడ్‌షో నిర్వహించారు. ఈసందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ సీఎం విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు. ప్రజలకు ఏం చేయగలమో.. ఎంత మంచి చేయొచ్చో అదే జగన్ చెప్పాడన్నారు. నవరత్న పథకాలను మరింత మెరుగుపరిచి మేనిఫెస్టోలో పొందుపరిచారన్నారు. నిజాయితీ, నిర్భయంగా ఎన్నికలకు వెళ్దామని చెప్పే నైజం తమ నాయకుడిదన్నారు. పెన్షన్లు రూ.3500కు, రైతు భరోసాను రూ.50 వేల నుంచి రూ.80 వేలకు పెంచనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ చేయూత సొమ్మును రూ.18,500 నుంచి రెట్టింపు చేస్తామని చెప్పడం గొప్ప విషయమన్నారు. మేనిఫెస్టో వందకు వంద శాతం ఫలితాలు సాధిస్తుందని, తప్పకుండా 175 కు 175 సీట్లు సాధించడం ఖాయమన్నారు. ప్రచార కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, సర్పంచులు రత్నమ్మ, రుద్రానంద, ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, రాష్ట్ర నాయకులు త్రిలోక్ రెడ్డి, ప్రభావతి, పార్టీ మండల అధ్యక్షుడు మచ్చన్న, జిల్లా ప్రచార కమిటీ ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి, సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్ప, దేవనాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హనమంతరాయుడు, బ్రహ్మానందరెడ్డి, వీరాంజి, ఎర్రిస్వామి, రామాంజనేయులు, ధనంజయ, సోమప్ప, అశోక్, హనమంతప్ప, శంకరయ్య, కుళ్లాయప్ప, చిన్నకుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి



ధర్మాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వైవీఆర్

- ఎమ్మెల్యే వైవీఆర్



ఊటకల్లులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుత్తి రూరల్: మంచి మనసున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి కోరారు. శనివారం మండలంలోని బసినేపల్లి తండా, బసినేపల్లి, ధర్మాపురం, యంగన్నపల్లి, ఊటకల్లు, బేతాపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే వైవీఆర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే వైవీఆర్ ప్రజలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించి సీఎం జగన్ గత ఐదేళ్లలో చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత దేశంలో ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా సంక్షేమ పథకాల ద్వారా నేరుగా మహిళల ఖాతాలో నగదు జమ చేశారన్నారు కరోనా కాలంలో సీఎం జగన్ వలంటీర్ల సాయంతో ఇళ్లవద్దకే మందులు, మెరుగైన వైద్యంతో పాటుగా ఉచితంగా బియ్యం పంపిణీ చేసి ప్రజలకు అండగా నిలిచారన్నారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మళ్లీ జగన్ సీఎం కావాల్సిన అవసరం ఉందన్నారు. అరాచకాలు, అక్రమాలకు కేరాఫ్ అయిన టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరామ్‌కు ఓటేస్తే గ్రామాల్లో కక్షలు, కార్పణ్యాలు పెరిగి ప్రజల ప్రశాంతతకు భంగం కలుగుతుందన్నారు. జయరామ్ సోదరులిచ్చే డబ్బు, ప్రలోభాలకు లొంగవద్దని, వాళ్లు ఓడిపోతే దౌర్జన్యం చేసి పంచిన ప్రతి రూపాయీ వసూలు చేస్తారన్నారు. ఎంపీగా శంకర్‌నారాయణ, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సుశీలమ్మ, మహబూబ్‌బీ, మక్కెల చంద్ర, అలవాల లహరిరెడ్డి, చిన్న అంజనేయులు, కర్లకుంట రమేష్‌బాబు, స్థానిక నాయకులు లాలునాయక్, జగన్‌నాయక్, సచివాలయ కన్వీనర్ సుభాష్‌రెడ్డి, హనుమంతు, షెక్షావలి, మురళీధర్‌రెడ్డి, శ్రీనివాసులు, ప్రసాద్, పరమేష్, రామదాసు, నాగేశ్వరరావు, రంగస్వామి, నాగన్న, అలవాల సూర్యనారాయణరెడ్డి పార్టీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా నాయకుడు విశ్వేశ్వరరెడ్డిని గెలిపించండి



జరుట్లరాంపురంలో ప్రచారం చేస్తున్న ప్రణయ్‌రెడ్డి

వజ్రకరూరు: త్వరలో జరిగే ఎన్నికల్లో ప్రజా నాయకుడు విశ్వేశ్వరరెడ్డిని గెలిపించాలని యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్‌కు మార్‌రెడ్డి ఓటర్లను కోరారు. శనివారం జరుట్లరాంపురం, పందికుంట, ఎస్‌ఎస్‌పీతండా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ యువనేత వై.ప్రణయ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జరుట్ల రాంపురం చేరుకున్న యువనేత స్థానిక జరుట్లరామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో యువ నేత వై.ప్రణయ్‌రెడ్డికి స్థానిక వైనాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు స్వాగతం పలికారు. ప్రణయ్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అధికారం కోసం గతంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకొచ్చిన తర్వాత విస్మరించాడన్నారు. సీఎం జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు వర్తింపాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రమావత్‌దేవి, పార్టీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి డిష్ సురేష్, సీనియర్‌నాయకుడు వైద్యనాథరెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రామాంజనేయులు, ఏఎంసీ చైర్మన్ అమర్‌నాథ్, మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు షేక్‌హ బీబ్, సర్పంచులు ఉమామహేశ్వరి, కవితాబాయి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బీకానాయక్, రమేష్,బొజ్జన్న, అసేన్‌వలి, రామకృష్ణనాయక్, వెంకటరమణ, నన్ రాజా సాబ్, కమల్‌సాబ్, శీనానాయక్, సంతోష్‌నాయక్, గణేష్‌నాయక్, ధర్మనాయక్, మహేష్‌నాయక్, మల్లేష్, వెంకట్రామరెడ్డి ,హిమవంత్‌రాజు, గోవిందు, రత్నశేఖర్, మీసాల సుంకన్న, బోయశివ, పెద్దపీరా, సురేంద్ర, సుంక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రణయ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం

ఉరవకొండ: స్థానిక ఒకటో వార్డు కామన్నకట్ట వీధి, బాబాఫకృద్దీన్ జెండా కట్ట, 3వ వార్డు బళ్లారి వారి వీధి ప్రాంతాల్లో యువనేత వై.ప్రణయ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేస్తారని పార్టీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు కామన్నకట్ట నుంచి ప్రచారం ప్రారంభమవుతుందన్నారు.

విశ్వేశ్వరరెడ్డిని ఆదరించండి

విడపనకల్లు: మండలంలోని గడేకల్లులో ఎంపీపీ కరణం పుష్పావతి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డిని గెలిపించాలని ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని సర్పంచు సుశీల, ఎంపీటీసీ ఓబుళేసు, నాయకులు కరణం భీంరెడ్డి, హంపయ్య, సునీల్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, హేమంత్, ఉమాశంకర్, మాజీ ఎంపీటీసీ ప్రసాదు, సురేష్‌యాదవ్ తదితర మహిళలు ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మహిళా నాయకులు మహేశ్వరి, భూలక్ష్మి, మీనాక్షి, భాగ్యమ్మ, శివప్ప,ఎర్రెన్న, జయరాముడు, కురుబ చిన్న రామలింగ,పెద్ద రామలింగ, శేషిరెడ్డి, భీమసేన, నాగరాజు, భీమలింగ, మాధవరెడ్డి, మల్లప్ప, లాలెప్ప,అడివప్ప, వెంకన్న, నెట్టి, వెంకటేశులు, భీముడు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వర రెడ్డి గెలిస్తేనే గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని ఎంపీపీ నారాయణ రెడ్డి తెలిపారు. శనివారం కమ్మూరులో విశ్వేశ్వర రెడ్డి, శంకర నారాయణలకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగారెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సంగప్ప, జేసీఎస్ మండల కన్వీనర్ దేవేంద్ర, పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, నాయకులు తుప్పటి హరీష్, మంజునాథ్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, వెంకటరామిరెడ్డి, కృష్టారెడ్డి, రామ్మూర్తి, ఎర్రప రెడ్డి, ఆదెప్ప, గోవింద్, ఎర్రిస్వామి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొంతూరుకు రోడ్డు వేయలేని అసమర్థుడు కేశవ్



మాట్లాడుతున్న ఎన్నికల ఇన్‌చార్జ్ బెస్త రమణ

ఉరవకొండ: స్థానిక ఎమ్మెల్యే కేశవ్ ఎంత సమర్థుడో నియోజకవర్గ ప్రజలందరికీ బాగా తెలుసు అని.. కనీసం సొంతూరుకు రోడ్డు వేయించుకోలేని అసమర్థుడు అని నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ బెస్త రమణ ధ్వజమెత్తారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, మండ సమన్వయకర్త ఓబన్న, జేసీఎస్ కన్వీనర్ ఆసిఫ్, వేమన్నతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే కేశవ్ టీడీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాడన్నారు. పేదరైతుల నుంచి కారుచౌకగా భూములు లాక్కొని, వాటిని గాలిమరల సంస్థలకు రూ.కోట్లకు విక్రయించాడన్నారు. నియోజకవర్గానికి 800 కోట్లతో మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు మంజూరు చేయించి, వాటిని ప్రారంభించకుండా కమీషన్లు స్వాహా చేశాడన్నారు. ఓట్ల కోసం ఉరవకొండలోని పేద ప్రజలకు నకిలీపట్టాలు ఇచ్చి మోసగించారన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద బ్లాక్‌మెయిలర్‌గా కేశవ్ గుర్తింపు తెచుకున్నాడన్నారు. తన రాజకీయ గురువు చంద్రబాబు ద్వారా మోసాలు, అక్రమాలు ఎలా చేయాలో శిక్షణ పొందిన వ్యక్తి కేశవ్ అని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి విశ్వసనీయతకు మారుపేరుగా ప్రతి ఒక్కరికీ తెలుసునన్నారు. కేశవ్‌లాగా గెలిచిపోయి నియోజకవర్గ ప్రజలకు మొహం చాటేసే వ్యక్తి విశ్వ కాదని.. గెలిచినా, ఓడినా నిత్యం ప్రజల్లో ఉంటాడన్నారు. నియోజకవర్గ ప్రజలు విశ్వేశ్వరరెడ్డి, కేశవ్‌ల మధ్య ఎంత వ్యత్యాసం ఉందో తెలుసుకోవాలన్నారు. ఎవరు అసమర్థుడో, ఎవరు సమర్థుడో నియోజకవర్గ ప్రజలు గమనించాలన్నారు.

వలంటీర్ల రాజీనామా

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన 14 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను శనివారం ఎంపీడీఓ శ్రీనివాసులుకు అందజేశారు. అనంతరం వలంటీర్లు మాట్లాడుతూ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా వై.వెంకట్రామిరెడ్డి, ఎంపీగా శంకర్‌నారాయణను భారీ మెజారిటీతో గెలిపించేందుకు రాజీనామా చేశామన్నారు. మళ్లీ జగనన్నను సీఎం చేయడమే తమ లక్ష్యమన్నారు.

వజ్రకరూరు: మండలంలోని ఎస్‌ఎస్‌పీ తండాకు చెందిన గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారు. గ్రామానికి చెందిన రామ్లనాయక్, సురేష్‌నాయక్, వెంకటస్వామినాయక్, గోపినాయక్, రేవతి, సరోజాబాయి తదితరులు రాజీనామా చేశారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



అలంకరణలో జనార్దన వేంకటేశ్వరస్వామి

వజ్రకరూరు: మండల కేంద్రంలో జనార్దన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీసేవ నిర్వహించారు. రాత్రి స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం గరుడోత్సవం కనుల పండువగా జరిగింది.

నేడు స్వామివారి రథోత్సవం: స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామి రథోత్సవం జరగనున్నట్లు ఆలయ ఈఓ అంగదాల కృష్ణయ్య తెలిపారు. ఉదయం ఆలయంలో పల్లకీసేవ, రథహోమం, రథప్రతి ష్టాపనబలి, పూర్ణాహుతి హోమం, మడుగుతేరు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆస్పత్రికి బెడ్‌షీట్ల అందజేత

గుంతకల్లుటౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి రోటరీక్లబ్ ప్రతినిధులు 105 బెడ్‌షీట్లు అందజేశారు. శనివారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డికి వాటిని అందించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, శివానంద, సభ్యులు డిష్ రాము, శ్రీనివాసులు, హరినాథ్, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రేణుక, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆటోలో నుంచి పడి వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని గుంతకల్లు రోడ్డులో బ్రిడ్జి సమీపంలో శనివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో రాముడు అనే వ్యక్తి గాయపడ్డాడు. గుత్తిలోని అనంతపురం రోడ్డులో నివాసముండే రాముడు గుంతకల్లుకు ఆటోలో బయలుదేరాడు. ఆటోలో వెనుక భాగంలో కూర్చొన్న రాముడు స్పీడ్ బ్రేకర్ వద్ద ఆటోలో నుంచి జారి కింద పడి గాయపడ్డాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనాలు ఢీ– ఒకరికి గాయాలు

గుత్తి పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని రామాంజి అనే వ్యక్తి గాయపడ్డాడు. తురకపల్లి రోడ్డులో నివాసముండే రామాంజి బైక్‌లో పోలీసు స్టేషన్ వైపు వెళుతుండగా వెనుక నుంచి మరో బైక్ ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన రామాంజిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.